ఆ నయవంచకుడి
బారినుండి
ఆమె
తప్పించుకోగలిగిందా?

చల్లా ఉషాకుమారి కథ

# ఘోస్ట్ రైటర్

"ఎక్స్‌క్యూజ్ మీ!" తియ్యటి కంఠం.

ఆఫీస్‌లో ఫైళ్ళు పరిశీలిస్తున్న ప్రకాష్ తలెత్తి చూశాడు. తెలుపు, గులాబి రంగు కలబోసినట్లున్న శరీరచ్ఛాయ. వైలట్ కలర్ శారీ. ఏ దేవకన్యో ఆఫీసులోకి అడుగు పెట్టలేదు కదా. కళ్లప్పగించి ఆమెకేసి చూస్తుండిపోయాడు.

"మీ పనికి అంతరాయం కలిగించలేదు కదా?" అడిగిందామె.

"అబ్బే ఎంతమాట" ఎర్రటి ఎండలో చల్లటి షర్బత్ తాగిన ఫీలింగ్.

"ప్రఖ్యాత రచయిత ప్రకాష్‌గారు... మీరే కదా?" సందేహంగా అడిగింది.

"ఎస్, ఎస్ నేనే కూర్చోండి. రంగన్నా కూల్ డ్రింక్స్ తీసుకురా" చెప్పాడు ప్రకాష్

"అబ్బే ఎందుకండీ?" మొహమాటపడిందామె.

"అహ అలా అంటే కాదు. చెప్పండి" అన్నాడు ముందుకు జరిగి.

"నేను వైజాగ్‌నుండి వచ్చానండి. నా పేరు నీలిమ. నేను మీ అభిమానిని" అంది నీలిమ.

"ఓ అలాగా చాలా సంతోషం" అన్నాడు ప్రకాష్.

"మీ సీరియల్ పత్రికలో చూశాను. చాలా బాగా రాస్తున్నారు. అసలు అంత బాగా రాయాలంటే మీరు ఎంతో కష్టపడి ఉంటారు. అవునా? అసలు మీరు ఏ టైములో రాస్తూ ఉంటారు?"

"నేనా! ఆ నాకు వీలైనప్పుడు" తడబ



దుతూ అన్నాడు ప్రకాష్.

"మరి ఉదయం నుండీ ఆఫీసులోనే ఉంటారుగా ఎప్పుడు రాస్తారు?" మళ్ళీ ప్రశ్నించిందామె.

ఒక్క నిముషంసేపు ఆలోచించాడు ప్రకాష్. ఉహూ... సమాధానం ఇలాక్కాదు ఇవ్వడం. ఒకసారి గంభీరంగా చూశాడు.

''లోకమంతా నిద్రిస్తున్నవేళ, తారలు నాతో గుసగుసలాడేటప్పుడు నేను మాత్రమే ఒంటరిగా కూర్చుని రాస్తూ ఉంటాను'' తన్మయంగా వింటోంది నీలిమ.

''అబ్బ, ఎంత బాగా చెప్పేర్సార్. అందుకే మీ రచనలకు అంత డిమాండ్'' అంది అభినందన పూర్వకంగా చూస్తూ.

''రండి మా ఇంటికి వెళదాం. మా శ్రీమతిని కూడా పరిచయం చేస్తాను'' అన్నాడు ప్రకాష్.

ఆనందంగా అనుసరించింది నీలిమ.

***

''ఇదిగోండి... ఈవిడే నా శ్రీమతి. ఆ... భానూ ఈవిడ నా అభిమాని మిస్ నీలిమ'' అన్నాడు.

''అలాగా నమస్కారం'' అంది భానుమతి నిండుగా నవ్వుతూ.

''నమస్కారమండీ'' అంది నీలిమకూడా.

''అది సరేగానీ భానూ. మాకు టిఫిన్ ఏర్పాట్లు చూడు'' అన్నాడు ప్రకాష్.

''అబ్బే ఎందుకండి ఇబ్బంది'' అంది నీలిమ.

''అహ అలాంటిదేం లేదు. ఒక్క ఫైవ్ మినిట్స్'' అంటూ వంటగదిలోకి వెళ్ళింది భానుమతి.

నీలిమ అతడి రచనల గురించి రకరకాల ప్రశ్నలు వేస్తోంది. ప్రకాష్ తడబడుతూ సమాధానం చెప్తున్నాడు. మనసులో చాలా చిరాకు పడుతున్నాడు. 'అబ్బ ఎప్పుడూ ఈవిడకి రచనల గొడవే. అవికాక ఏవైనా స్వీట్ థింక్స్ చెప్పకూడదూ'. ఆలోచిస్తూ ఆ... ఊ... అంటున్నాడు.

''మీరు ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు'' అంది నీలిమ.

''అబ్బే ఏం లేదు. నా రచనల గురించి ఎక్కువగా మాట్లాడటం నన్ను పొగిడినట్లుగా అనిపిస్తోంది. నాకసలు పొగడ్తలు అస్సలు ఇష్టం ఉండవ్'' అంటూ గంభీరంగా ఫోజిచ్చాడు ప్రకాష్.

''మీ నిరాడంబరత్వానికి నా జోహార్లు. మీలాంటివారంటే నాకు చాలా అభిమానం'' అంది ఆరాధనగా చూస్తూ. ఈలోగా భానుమతి పకోడీలు తెచ్చిపెట్టింది. టిఫిన్ కాఫీ ముగిశాక ''ఇక వస్తానండీ'' అంది నీలిమ నమస్కారం చేస్తూ.

''పదండి డ్రాప్ చేస్తాను'' అన్నాడు ప్రకాష్.

''బస్‌లో వెళతాన్లెండి'' అంది మొహమాటంగా.

''ఫర్వాలేదు రండి'' అన్నాడు ప్రకాష్. తప్పనిసరిగా వెళ్ళి స్కూటర్ వెనకాల కూర్చుంది.

వాళ్ళ చుట్టాల ఇంటిదగ్గర ఆమెను దింపి, ''ఎల్లుండి సాయంత్రం ఐదుగంటలకు మా ఇంటికి రండి. ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి'' అన్నాడు.

''అలాగే'' అంది నీలిమ.

ఆనందంగా గాలిలో తేలుతూ ఇంటికి చేరుకున్నాడు ప్రకాష్. కాసేపు బయటికివెళ్ళి అటూ ఇటూ తిరిగి భోజనం కానిచ్చి డైరీ రాసుకుని నిద్రపోయాడు. ప్రకాష్‌కి ప్రతిరోజూ డైరీ రాసే అలవాటు లేదు. అప్పుడప్పుడు కొన్ని ముఖ్య విషయాలు

మాత్రమే రాస్తాడు.

***

మర్నాడు ప్రకాష్ ఆఫీసుకి వెళ్ళాక గదంతా సర్దుతోంది భానుమతి. పైనుండి డైరీ కిందపడింది. తీసి యథాస్థానంలో పెట్టబోయింది. కానీ ఓ పేజీలో 'నీలిమ' అన్న పేరు చూసి కుతూహలంగా పేజీలు తిరగవేసింది. ఆ పేజీనిండా నీలిమ గురించి అసభ్యంగా రాసుంది. 'రేపు దాన్ని ఎలాగైనా సాయంత్రం ఇంటికి పిలిచి, ఇక్కడినించి మభ్యపెట్టి లాడ్జికి తీసుకెళ్ళాలి. తీసుకువెళ్ళి ...' ఇక చదవలేకపోయింది భానుమతి. మరో పేజీ తిప్పింది.

రమ్యా లాడ్జి, రూమ్ నెంబర్ 24, పేరు రహీమ్. తేదీ చూసింది. రేపటి తేదీ అంటే రేపు లాడ్జికి బుక్ చేసేడన్నమాట నీలిమని తీసుకెళ్ళడానికి. ఊ... జాగర్తలు బానే తీసున్నాడు. పేరు మార్చుకుని లాడ్జికి వెళతాడన్నమాట. అయినా కన్‌ఫర్మ్ చేసుకుందాం అనుకుంటూ లాడ్జికి ఫోన్‌చేసి అడిగింది.

"రేపటికి రూం నెంబర్ 24 ఎవరికైనా ఎలాట్ అయిందా?" అని అడిగిందా.

"ఆ... రహీమ్ సాహెబ్‌కి ఎలాటయిందమ్మా" అన్నాడు.

"మైగాడ్" అప్రయత్నంగా అనుకుందామె.

క్షణంలో ఒక స్థిర నిశ్చయానికొచ్చింది. ఆమె కళ్ళు వింతగా వెలుగును నింపుకున్నాయ్. ఒక చిరుదరహాసం పరుగెత్తుకుంటూ వచ్చి ఆమె పెదవులను అలంకరించింది. ఆమె ఆ క్షణంనుండే మర్నాటి సాయంత్రానికై ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

***

మర్నాడు... మధ్యాహ్నం మూడుగంటలైంది. డైరీలో నీలిమ ఫోన్ నెంబర్ వెతికింది. నీలిమకి ఫోన్ చేసింది.

"హలో... ఎవరూ?" అంది నీలిమ.

"నేను భానుమతిని" అంది భానుమతి.



## రాగాలాపన!

అప్పుడే పుట్టిన పక్షి తన తల్లిదండ్రులు చేసే శబ్దాల్ని అనుకరిస్తాయి. తల్లి పక్షి పాడే పాటల్నే అవి కూడా ఆలపిస్తాయి. అదే వాటిని తల్లి పక్షి నుండి వేరు చేస్తే వేరే జాతిపక్షి దగ్గరకు చేరిస్తే ఆ పక్షి పిల్లలు ఈ వేరే జాతి పక్షి మాటల్నీ, శబ్దాల్ని అనుకరించటానికి సమయం తీసుకుంటాయట.

—విహారిక

"ఓ మీరా ఏమిటి విశేషం" అడిగింది.

"మీరు ఈరోజు ఐదు గంటలకి కాకుండా నాలుగు గంటలకి రాగలరా మీతో మాట్లాడాలి" అంది భాను.

"ఓ.కె." అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసింది నీలిమ.

నాలుగుకి ఐదు నిమిషాలు ముందుగానే భానూ వాళ్ళింటిముందు ఆటో దిగింది నీలిమ.

"రా నీలిమా" అంది భానుమతి ఆప్యాయంగా.

నిమ్మపండు రంగు చుడీదార్, మేచింగ్ టాప్స్. భుజానికో కెమేరా. సింపుల్ గా ఉన్న నీలిమను చూసి భానుమతి ముగ్ధురాలైంది.

"కూర్చో" అంది కుర్చీ ముందుకి జరిపి.

"ఏంటీ ఏదో మాట్లాడాలన్నారు?" కూర్చుంటూ అడిగింది నీలిమ.

"ఎలా మొదలుపెట్టాలో తెలియడం లేదు నీలిమ. ఈరోజు ఐదుగంటలకి ఆయన నిన్ను ఇక్కడికి రమ్మన్నారు కదా. ఎందుకు రమ్మన్నారో తెలుసా" అని అడిగింది తాపీగా.

మొహం చిన్నగా చిట్లించింది నీలిమ. 'ఈవిడ బాగా అనుమానం మనిషిలా ఉందే' మనసులోనే చిరాకుపడింది.

"ఏం వుంది? ఏదో విషయం మాట్లాడాలని. ఈ మాత్రానికే మమ్మల్ని మీరలా అనుమానించడం భావ్యంకాదు" విసురుగా అంది నీలిమ.

"సరే ఈలోగా ఈ డైరీ చదువు. నేను కాఫీ కలిపి తీసుకువస్తాను" అంటూ డైరీ అందించింది.

ఒకళ్ల డైరీ చదవడం భావ్యమా? అనిపించింది ఒక్క క్షణం. కానీ ఎందుకు చూడమన్నారో అనే కుతూహలంతో డైరీ తిప్పింది. డైరీలో అక్కడక్కడ కొన్ని కాగితాలు రాసి ఉన్నాయి. చాలా కాగితాలు ఖాళీగా ఉన్నాయి.

మొదటి పేజీ చదివింది నీలిమ. షాక్...

షాక్... ఏమిటి? ఇది నిజమా.... ఒకలాంటి టెన్షన్.

అందులో ఇలావుంది. "రచనలన్నీ నా పేరుమీదే పంపించాలి. లేకపోతే నీకు విడాకులిస్తాను అని బెదిరించే సరికి బెదిరిపోయి రచనలన్నీ నా పేరుమీదే పంపిస్తోంది. హాయిగా డబ్బుకు డబ్బు, పేరుకు పేరు. అంతేకాకుండా అమ్మాయిలతో పరిచయం"

అంటే... ఈ రచనలన్నీ చేసినది భానుమతిగారా? ఎంత వంచన. తను నిజంగా మోసపోయింది. రచనలు చేసేది ప్రకాష్ అనుకుంది. మరొక పేజీ తిప్పింది.

అందులో... నీలిమ గురించి అసభ్యంగా రాసివుంది. బ్రూట్ ఎలా రాసేడు? ఇప్పుడు ఎదురుగుండా వుంటే... అంటూ ఆవేశపడింది.

మరొక పేజీ తిప్పింది. అందులో... రమ్యా లాడ్జిలో 24 నెంబర్ రూం బుక్ చేశాను. రమేష్ పేరుతో. నీలిమని ఎలాగైనా తీసుకెళ్ళాలి. అంటే... అంటే... ఒక్క క్షణం తల రెండు చేతుల్తోను పట్టుకుని

కూర్చుండిపోయింది. తరువాత రమ్యా లాడ్జికి ఫోన్ చేసింది.

"రూమ్ నెంబర్ 24 ఎవరికి ఎలాట్ అయింది" అని అడిగింది.

"మిస్టర్. రహీమ్‌కి" అని సమాధానం వచ్చింది.

ఫోన్ డిస్‌కనెక్ట్ చేసింది నీలిమ.

"నీ సందేహం తీరిందనుకుంటాను" అంటూ భానుమతి కాఫీ కప్పులతో లోపలికి వచ్చింది. నీలిమకి గొంతు పెగలడం లేదు. దుఃఖం గొంతుకి అడ్డుపడుతోంది.

"ఏడవకు. ప్రమాదం తప్పినందుకు ఆనందించాలి. గానీ ఏడుపెందుకూ? ముందు కాఫీ తాగు" అంటూ కాఫీ కప్పు చేతికందించింది.

మంత్రముగ్ధలా ఆమె చెప్పినట్టు చేసింది ఈలోగా తలుపు చప్పుడు వినిపించింది.

"ఇప్పుడెలా?" ఆందోళనగా అడిగింది నీలిమ.

"కంగారుపడకు. చూడు ఆ గదిలో కూర్చో. అది స్టోర్ రూం. అందులోకి ఎవరూ రారు" అంది భాను.

ఈలోగా కాఫీ కప్పులు లోపలపెట్టి నీలిమ చెప్పులు మంచం కిందకి తోసింది.

ఎట్టి పరిస్థితిలోనూ నువ్వు ఇవతలకి మాత్రం రాకు అని హెచ్చరించి తలుపు తియ్యడానికి వెళ్ళింది.

నీలిమ కూర్చున్న గదిలోకి వీధిగది స్ట్రెయిట్‌గా కనిపిస్తోంది. అయితే స్టోర్‌రూమ్ చీకటిగా ఉండటంవల్ల నీలిమ ఎవరికీ కనపడదు.


ఈలోగా తలుపు తీసింది భాను.

"తలుపు తియ్యడానికి ఇంత లేటా?" చిరాగ్గా అంటూ లోపలికి వచ్చాడు ప్రకాష్.

"బాత్‌రూంలో ఉన్నాను. అందుకే లేటయ్యింది" అంది భాను.

"నీలిమ వచ్చిందా?" ఆత్రంగా అడిగాడు ప్రకాష్.

" ఆ వచ్చింది. సినిమాకెళ్తున్నానని



చెప్పింది'' అంది భాను.

''సినిమాకా? ఇవాళ తప్పకుండా ఇక్కడికి రమ్మన్నానే'' అన్నాడు బాధగా.

''సినిమా కెళ్తున్నాను. ప్రకాష్ గారికి చెప్పి వెళదామని వచ్చాను. ఆయన లేరుకదా మీరు చెప్పండి అని వెళ్ళింది'' అంది.

''ఏ సినిమాకి?'' ఆదుర్దాగా అడిగాడు ప్రకాష్.

''అడగలేదండీ'' తాపీగా చెప్పింది భాను

''అయ్యో! ఎలా?'' అంటూ తల పట్టుకున్నాడు ప్రకాష్.

''[illegible]... నువ్వే ఏదో చెప్పి పంపేసుంటావ్. [illegible]నిమా ఆరుగంటలకి ఉంటుంది. అసలు [illegible]ను వచ్చేవరకూ కూర్చోమని చెప్పొచ్చు[illegible]. అస్తమానూ నా విషయాల్లో ఎందుకు జోక్యం చేసుకుంటావ్? అసలు నిన్నూ...'' అంటూ చాకు తీసుకుని గొంతులో గుచ్చబోయాడు.

నీలిమ కంగారుగా చూస్తోంది. 'ఎలా? భానుమతిగారు ఇవతలకి రావద్దన్నారు? మరి... ఇప్పుడీ పరిస్థితిలో ఇవతలకి రాకపోవడమే మంచిదేమో?

సడన్‌గా ఫ్లాష్‌లాంటి ఐడియా! క్షణంలో కెమెరా ఎడ్జస్ట్ చేసి చకచకా రెండు ఫోటోలు తీసింది.

భానుమతి నేర్పుగా పక్కకి తప్పుకుని, చాకు లాక్కుని అవతల పడేసింది. ''చూడండి! నా ఆత్మరక్షణ నేను చేసుకోగలను. నాకు కరాటే వచ్చనే విషయం మరిచిపోకండి'' అంటూ విసవిసా వంటింట్లోకి నడిచింది.

ప్రకాష్ నేలను ఒక్క తన్ను తన్ని ''ఛీ వెధవ కొంప'' అంటూ బైటికి పోయాడు ప్రకాష్.

నీలిమ బైటికి వచ్చింది.

''మీ సహాయానికి కృతజ్ఞతలు'' అంది భానుమతితో.

''వెళ్ళేముందు ఒక్క సలహా. ఇంకెప్పుడూ రచయితలనూ, రచయిత్రులనూ కలవడానికి ప్రయత్నించకు. వాళ్ళ రచనలను మాత్రమే అభిమానించు. నీ అభిమాన రచయిత్రిగా ఇది నేను నీకిస్తున్న సలహా'' అంది భాను నవ్వుతూ.

''తప్పకుండా గుర్తుంచుకుంటాను. ఈ ఫోటోలు అవసరమౌతాయనుకుంటే మీ దగ్గర ఉంచండి'' అంది రెండు ఫోటోలు చేతికిస్తూ.

భానుమతి ఆశ్చర్యపోయింది. అందులో... భానుమతిని హత్యచేయడానికి ప్రయత్నిస్తున్న ప్రకాష్ ఫోటో ఉంది. రెండో ఫోటో కూడా ఇంచుమించు అలాగే ఉంది.

''ఎప్పుడు తీసావ్ ఈ ఫోటోలు?'' ఆశ్చర్యంగా అడిగింది భాను.

''ఇందాక ఆ గదిలో కూర్చుని తీశాను. ఇది ఆటోమేటిక్ కెమెరా. నేను ఫోటోగ్రఫీలో డిప్లమా చేశాను. అందుకే అంత పర్‌ఫెక్ట్‌గా తియ్యగలిగాను'' అంది నీలిమ నవ్వుతూ.

థాంక్స్ నీలిమా. ఈ ఫోటోలు నాకు తప్పక ఉపయోగపడతాయి'' అంది భానుమతి.

నీలిమ సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

***

ఆరోజు... పత్రికా ప్రపంచానికి ఒక సంచలనమే! సరికొత్త ప్రయోగాలు చేసే ఒక పత్రిక రచయితను కాకుండా రచయిత భార్యను ఇంటర్వ్యూ చేద్దామనుకుంది. ప్రకాష్ అతని భార్యా ఇంటర్వ్యూకి వచ్చారు.

ఇంటర్వ్యూ మొదలైంది. ఫార్మల్ క్వశ్చన్స్ అయ్యాక...

"మీరు రచనలు చెయ్యడంలో మీ భర్తకి ఎలా సహాయపడతారు?"

ఒక్క క్షణం నిశ్శబ్దం.

"చాలా సహాయపడతాను. ఆ రచనలన్నీ నేనే చేస్తాను" తాపీగా సమాధానం ఇచ్చింది భాను.

గాలి స్తంభించింది. అందరూ మౌనంగా ఉండిపోయారు. అందరి మనసుల్లోనూ ఒకటే ప్రశ్న. "ఇది నిజమా?" అని.

"మీకు అనుమానంగా ఉంటే మా ఇద్దరినీ ఒక కథ రాయమని చెప్పండి. శైలిని బట్టి ఇంతకాలం ఆ కథలు ఎవరు రాసేరో సులభంగా పోల్చుకోవచ్చు" సలహా ఇచ్చింది భానుమతి.

ఒక్క క్షణం ఎవరూ మాట్లాడలేదు. ముందుగా తేరుకున్నది ప్రకాషే.

"ఎంత ధైర్యం నీకు? నీకు విడాకులిస్తాను" అన్నాడు బెదిరింపుగా చూస్తూ.

"విడాకులు నువ్విచ్చేదేమిటి? నేనే ఇస్తున్నా. ఇదిగో లాయర్ నోటీస్" హేండ్‌బ్యాగ్‌లోంచి తీసి ఇచ్చింది.

"ఇంకా మీ డైరీ నా లాయర్ దగ్గర భద్రపరచబడింది" అంది గంభీరంగా.

"నిన్నసలు బతకనివ్వను. చంపేస్తాను" అన్నాడు భయంకరంగా చూస్తూ.

"అవసరం లేదు. కోర్టు మీకే ఆ శిక్ష విధిస్తుంది. ఎటెంప్ట్ టు మర్డర్ కింద" అంటూ ఫోటోలు రెండూ తీసి ఇవతల పెట్టింది భానుమతి.

"ఎవరు తీశారూ?" అన్నాడు భయంగా చూస్తూ.

"నీలిమ" స్థిరంగా పలికింది భానుమతి.

భానుమతిని చంపడానికి ప్రయత్నిస్తున్నట్లున్న ఫోటోలు ఆ రెండూ. ఆ ఫొటోలు అవి చింపెయ్యబోయాడు ప్రకాష్.

"నా దగ్గర ఇంకా చాలా కాపీలున్నాయి. చింపినా మరేం ఫరవాలేదు" తాపీగా సమాధానం ఇచ్చింది భానుమతి.

తరువాత ఆ రచనలన్నీ భానుమతి చేసిందని శైలిని బట్టి పోల్చారు. "అసలు ఫస్టే మీరు ఇతన్ని ఎందుకు ఎదిరించలేదు?" అని అడిగారు ఎడిటర్.

"మొదట్లో నా సంసారం కూలిపోతుందనే భయంచేత. కానీ రానురాను నాకతని ప్రవర్తనపట్ల అసహ్యం ఏర్పడింది. అందుకే అవకాశం కోసం చూశాను. ఫలితం మీరే చూశారుగా" అంది భానుమతి నవ్వుతూ.

ప్రయోగాల పత్రికకు మనస్ఫూర్తిగా జోహార్లు అర్పిస్తూ సెలవు తీసుకుంది భానుమతి.